చెదురుతున్న చరిత్ర సంతకం



దొరవారిసత్రంలో వెంకటగిరి రాజులు తవ్వించిన పురాతన కోనేరు

నాడు అనేది నేటికి గతించిన విషయం. అలా గతించిన కాలమే చరిత్ర. అలాంటి చరితే ప్రస్తుత కాలానికి ఓ ఇరుసు అనేది కాదనలేని సత్యం. అందుకే కీలకాధారాలైన పురాతన సాక్ష్యాలను కాపాడుకునేందుకు విజ్ఞులు ప్రయత్నిస్తుంటారు. ప్రభుత్వం కూడా ఈ దిశగా కృషి చేస్తోంది. అందుకే పురావస్తు శాఖకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోంది. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా నాటి వైభవం చెరిగిపోతున్న సంతకంలా మారుతోంది. డీవీ సత్రంలో వెంకటగిరి రాజుల కాలం నాటి చెరిగిపోతున్న చారిత్రక సాక్ష్యాలపై ప్రత్యేక కథనం.

- పురాతన అద్భుతాలకు నిర్లక్ష్యపు చెదలు
- కాలగర్భంలో కలసిపోతున్న కట్టడాలు

దొరవారిసత్రం: ఘన ప్రాభవం కలిగిన కట్టడాలు అవి. చరిత్రకు ఆనవాళ్లు నిలిచాయి. నాటి వైభవానికి చిహ్నాలుగా నిలిచిన కట్టడాలపై పురావస్తు శాఖ



గుర్రాల చావిడి

చిన్నచూపుతో శిథిలావస్థకు చేరుతున్నాయి. దొరవారిసత్రంలో వెంకటగిరి రాజులు కాలంలో చెన్నపట్నం (చెన్నై)కు గుర్రాలపై వెళ్లే సమయంలో ఇక్కడ విశ్రాంతి తీసుకునేలా అప్పటి ఏడో జాతీయ రహదారి (ఏషియా హైవే45) ఆనుకుని 5 ఎకరాల విస్తీర్ణంలో పెద్ద కోనేరు తవ్వించారు. దీనికి పడమర భాగంలో రాణిమహల్, దక్షిణ భాగంలో గుర్రాలు సేద తీరడానికి గుర్రాల చావిడి నిర్మించారు. అంతే కాకుండా రాణిమహల్ ఎదురుగా సుమారు 15 అడుగుల ఎత్తు కలిగిన తులసి కోటను సైతం నిర్మించారు. రాణిమహల్ 40 ఏళ్ల కిందట, తులసికోట 20 ఏళ్ల కిందట శిథిలమయ్యాయి. ప్రస్తుతం కోనేరు, గుర్రాలు చావిడి మాత్రం ఉన్నాయి. సుమారు 25 ఏళ్ల కిందట భవన వసతి లేనందున గుర్రాల చావిడిలో పీహెచ్‌సీని కొన్నేళ్లపాటు, మరికొన్నేళ్లు మండల పశువైద్యశాలకు వినియోగించుకున్నారు. ఆస్పత్రి, పశువైద్యశాలలకు భవన వసతి కలగడంతో గుర్రాల చావిడి వదిలేశారు. దీంతో నిరుపయోగంగా మారి ప్రస్తుతం చీకటి కార్యకలపాలకు నిలయంగా మారింది.

తుపాన్‌లో ప్రజల ప్రాణాలను కాపాడిన గుర్రాల చావిడి

1984లో భారీ ఈదురుగాలులతో కూడిన తుపాన్ వచ్చిన సమయంలో దొరవారిసత్రం గ్రామంలో ఎక్కడా ఎవరికి పక్కాగృహాలు లేవు. అందరివీ పూరిపాకలు కావడంతో కూలిపోయాయి. ఆ సమయంలో ప్రజలందరూ ఈ గుర్రాలచావిడిలోనే తలదాచుకుని ప్రాణాలు దక్కించుకున్నారు. ఇప్పటికీ ఈ చావిడి చెక్కుచెదరకుండా ఉంది. దీన్ని మొత్తం రాయితోపాటు సున్నం వినియోగించి ఎంతో నైపుణ్యంగా నిర్మించి ఉన్నారు. ఈ కట్టడం అంతా రాళ్ల స్తంభాలు నిలబెట్టి వాటిపై రాళ్లు పేర్చి సున్నంతో శ్లాబ్ పనులు చేపట్టారు. దీనికి మరమ్మతులు చేస్తే ప్రయోజనంలోకి వచ్చే అవకాశం ఉంది.

“

పూర్వవైభవం తెచ్చేందుకు కృషి



దొరవారిసత్రంలోని కోనేరుకు పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. దీన్ని మరమ్మతులకు అవసరమైన నిధుల మంజూరు కోసం చర్యలు చేపట్టాం. బాటసార్లకు, పలు గ్రామాల ప్రజల దాహార్తి తీర్చిన ఘనత ఈ కోనేరుకు ఉంది.

– వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి

ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం



ఏకొల్లు పంచాయతీని దొరవారిసత్రంలో ఉన్న కోనేరును బాగు చేయడంతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనేలా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే కోనేరు మరమ్మతుల విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి నిధుల మంజూరు కోసం కృషి చేస్తున్నాం.

–ఆవల బ్లెస్సీ, సర్పంచ్, ఏకొల్లు పంచాయతీ

దాహార్తి తీర్చిన కోనేరు

20 ఏళ్ల కిందట వరకు నీటి పథకాలు, చేతి బోర్లు కూడా సక్రమంగా లేవు. గ్రామంలో అందరూ కోనేరులో నీటినే తాగేవారు. అయితే నేడు ఆ కోనేరంతా ముళ్లపొదలతో నిండిపోయి ఉంది. బాగు చేస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది.

క్లుప్తంగా

జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కలువాయి: మండలంలోని తోపుగుంట ఆర్బీకే పరిధిలో బుధవారం జొన్న కొనుగోలు కేంద్రాన్ని జెడ్పీటీసీ సభ్యులు బి.అనిల్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. సొసైటీ ద్వారా ఇక్కడ జొన్నలను కొనుగోలు చేస్తారని ఏఓ ప్రతాప్ తెలిపారు. మెట్ట రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బి.అనిల్‌కుమార్ రెడ్డి కోరారు. ఎంపీటీసీ సభ్యులు ఎస్.ప్రసాద్, సర్పంచ్ నిఖిల్, ఏఏబీ చైర్మన్ చంద్రబాబు, ఏఈఓ అనిత, సొసైటీ సీఈఓ సుదర్శన్ పాల్గొన్నారు.

నిర్మాణాలు వేగవంతం చేయండి



ఇళ్ల నిర్మాణాలకు మార్కింగ్ ఇస్తున్న అధికారులు

చిట్టమూరు: మండలంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలను వేగవంతం చేయాని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. జగనన్న గృహ సంకల్పంలో భాగంగా బుధవారం గునపాడు, గునపాటిపాళెం గ్రామాల్లో హౌసింగ్ అధికారులతో పర్యటించారు. గునపాటిపాళెంలో ఇళ్ల నిర్మాణాలకు మార్కింగ్ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు చిప్పల వెంకటయ్య, ఎంపీటీసీ సభ్యుడు పకీరయ్య, హౌసింగ్ ఈఈ మోహన్‌రావు, డీఈ చలమయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏఈ సుధీర్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ల అందజేత



ట్రాక్టర్లు అందిస్తున్న ఏఓ, బ్యాంకు అధికారులు

చిల్లకూరు: మండలంలోని తిక్కవరం, తొణుకుమాల, చేడిమాల ఆర్బీకేల పరిధిలో ఏర్పాటు చేసిన రైతు గ్రూపులకు బుధవారం అధికారులు ట్రాక్టర్లను అందజేశారు. ఎన్‌డీసీసీబీ సహకారంతో రైతు గ్రూపు సభ్యులకు ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, రోటావేటర్లు అందిస్తున్నట్లు ఏఓ గూడూరు భవానీ తెలిపారు. వ్యవసాయ సహాయకులు కిరణ్మయి, సువర్ణ, శివశంకర్ పాల్గొన్నారు.

మోటార్ల దొంగలను పట్టుకోవాలని ఫిర్యాదు

కోట: అన్నంబాక, తొనుగుమాల, తిమ్మనగారిపాళెం, పార్లపల్లె, కడివేడు గ్రామాల రైతులు బుధవారం కోట ఎస్ఐ పుల్లారావును కలిసి మోటార్ల చోరీలపై ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి పొలాల్లో అనుమానాస్పదంగా తిరుగుతు న్న ఓరేపల్లె శ్రీనివాసులు అనే వ్యక్తిని రైతులు పోలీసులకు అప్పగించారు. వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో పొలాల్లో 50 వరకు మోటార్లు, స్టార్టర్లు, కేబుళ్లు చోరీకి గురైనట్లు తెలిపారు. అనుమానితుల పేర్లను ఎస్ఐకు తెలిపామన్నారు. వెంటనే చర్యలు తీసుకుని మోటార్ల చోరీలను అరికట్టాలన్నారు. రైతుల ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ పుల్లారావు తెలిపారు.

అందరి సహకారం అవసరం

వెంకటగిరి: మున్సిపాలిటీని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు పట్టణ ప్రజలతోపాటు పారిశుద్ధ్య కార్మికుల సహకారం అవసరమని మున్సిపల్ కమిషనర్ బీవీ రామయ్య తెలిపారు. పట్టణంలోని పారిశుద్ధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోడ్లపై చెత్తవేయకుండా దుకాణయజమానులు, స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి

దక్కిలి: సచివాలయ వ్యవస్థ లక్ష్యాలను నెరవేర్చేందుకు సచివాలయ సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని ఎంపీడీఓ కోటేశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలోని అన్ని గ్రామాల్లో వేసవిలో తాగునీటి కొరత లేకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ నాగరాజు, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ వెంకటాద్రి పాల్గొన్నారు.

స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

దొరవారిసత్రం: మినమనముడి గ్రామ పరిధిలోని ఎస్టీలకు నివేశ స్థలాలు కేటాయించేందుకు గాను బుధవారం తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి రెవెన్యూ సిబ్బందితో కలిసి స్థలాన్ని పరిశీలించారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ భూమిని ఎస్టీలకు ఇళ్ల స్థలాలు కేటాయించి త్వరలోనే పట్టాలు ఇస్తామని తహసీల్దార్ తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఈశ్వరవాక శ్రీనివాసులరెడ్డి, వీఆర్వో వెంకటరత్నం ఉన్నారు.

24న మండల మీట్

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ జీ భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ స్వరూప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

టీడీపీ కంచుకోటలో ఎమ్మెల్యే కిలివేటికి ఘన స్వాగతం



సర్వారెడ్డికండ్రిగలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు స్వాగతం పలుకుతున్న మహిళలు

సూళ్లూరుపేట: టీడీపీకి కంచుకోట అయిన నాదెళ్ల వారికండ్రిగ పంచాయతీ సర్వారెడ్డికండ్రిగ (పిండిపాళెం)లో బుధవారం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు ఘన స్వాగతం లభించింది. గ్రామ సర్పంచ్ వీ సుధీర్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు అడుగడుగునా నీరాజనాలు పలికి గజమాలతో సత్కరించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ బావుటా బుక్‌లెట్‌లను అందజేశారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ ఈ గ్రామంలో మహిళలు స్వాగతం పలుకుతున్న తీరు చూస్తుంటే జగనన్న ఇస్తున్న సంక్షేమ పథకాలు ఎన్నో నిరుపేదల కుటుంబాలకు ఆసరాగా ఉన్నాయన్నారు. వీరి నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే 2024లో విజయం తమదేననే ధీమా కలుగుతోందన్నారు. చంద్రబాబుకు నిరుపేదలన్నా, దళితులన్నా పడదని అందుకే ఆయన సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టలేకపోయారన్నారు. ఈకార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు వెల్లూరి సుకుమార్, ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ వెల్లూరి ప్రియదర్శిని, ఉపసర్పంచి మెల్లకంటి శ్రీనివాసులు, పార్టీ నాయకులు జెట్టి వేణుయాదవ్, ముచ్చకాల హర్షవర్ధన్, బద్దెపూడి మోహన్‌రెడ్డి, గోవర్ధన్, మీజూరు రామకృష్ణారెడ్డి, అల్లూరు రమేష్‌రెడ్డి, కోడూరు రాజశేఖర్, వాకాటి హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే రైతు బజార్ ప్రజలకు అంకితం



రైతు బజార్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, తదితరులు

గూడూరు: తమ ప్రభుత్వ హయాంలో పట్టణ నడిబొడ్డున రూ.1.15 కోట్లతో నూతన హంగులతో రైతు బజార్ నిర్మాణం పూర్తి అయ్యిందని, త్వరలోనే ప్రారంభించి ప్రజలకు అంకితం చేస్తామని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. బుధవారం ఆయన రైతుబజార్‌ను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా పట్టణంలో రైతుబజార్ ఏర్పాటు ఆనందంగా ఉందన్నారు.

ప్రజోపయోగకర పనులకు డంపింగ్ యార్డు స్థలం

గూడూరులోనిపాత డంపింగ్ యార్డు స్థలాన్ని ప్రజోపయోగకరమైన పనులకు కేటాయిస్తామని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తెలిపారు. డంపింగ్ యార్డు వద్ద లెగసీ వేస్ట్ మేనేజ్‌మెంట్ బయో రిమిడిషన్ ప్రాసెస్ పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా దేవసేనమ్మ ఉన్నప్పటి నుంచి డంపింగ్ యార్డుపై ప్రత్యేక శ్రద్ధ చూపించారన్నారు. పొనకా దేవసేనమ్మ మాట్లాడుతూ వర్షాకాలం వచ్చేలోపు పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ యమునమ్మ, వైస్ చైర్మన్ కొట్టు గోవర్ధన్, అన్నం మురళి, గోపాల్‌యాదవ్, అజీజ్‌ఖాన్, అల్తాఫ్, కోదండరామయ్య, గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



అదనపు భవనం ప్రారంభోత్సవంలో నేతలు

కోట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ నరమాల వెంకటరమణయ్య అన్నారు. ఊనుగుంటపాళెం పీఏసీఎస్‌లో నూతనంగా నిర్మించిన అదనపు భవనం, స్ట్రాంగ్ రూమ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు పీఏసీఎస్‌లు పనిచేస్తున్నాయన్నారు. ఎన్‌డీసీసీబీ డిప్యూటీ జనరల్ మేనేజర్ దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ రూ.10 లక్షలతో ఊనుగుంటపాళెం పీఏసీఎస్‌కు అదనపు భవనం, స్ట్రాంగ్ రూమ్ నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అంజమ్మ, పీఏసీఎస్ చైర్మన్ హనుమంతరెడ్డి, సీఈఓ శ్రీనివాసులురెడ్డి, వేమారెడ్డి షనీల్ రెడ్డి, శ్యాంప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లలో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



బోర్డులు ఏర్పాటు చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడు పంచాయతీలో వేసిన పలు అక్రమ లేఅవుట్లలో బుధవారం స్థానిక సర్పంచ్ కుమారి కల్పన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ విజయమ్మ, కార్యదర్శి తిరుమలరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

పెళ్లకూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని జాతీయ రహదారి వద్ద జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని పెన్నేపల్లెకు చెందిన అవరంబేటి ప్రసాద్ మేనకూరు సెజ్‌లోని ఓపరిశ్రమలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో నాయుడుపేటలోని ఓప్లెక్సీప్రింట్‌లో పనుల నిమిత్తం మంగళవారం రాత్రి ఇంటి వద్ద నుంచి మోటారుసైకిల్‌లో నాయుడుపేటకు బయలుదేరాడు. మార్గం మధ్యలో జాతీయ రహదారి మలుపు వద్ద అతడిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈఘటనలో అతడు తీవ్రంగా గాయపడి, అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గుర్తించి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నాయుడుపేటకు తరలించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ కృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

రాపూరు: నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాపూరు మండలం చుట్టుపాళెం, నాయినిపల్లె, ఎంపీ పురం గ్రామాల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి బుక్‌లెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరిస్తుండడంతో ఎంతో సంతృప్తిగా ఉందన్నారు. ఇంత అనుభూతి గతంలో ఎప్పుడూ లేదన్నారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం

పెంచలకోనలో జరిగిన బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిశాయని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గతంలో ఎన్నడూ జరగని రీతిలో ఈ ఏడాది బ్రహ్మోత్సవాలను నిర్వహించామన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట నాయకులు పాపకన్ను దయాకర్‌రెడ్డి, ఎంపీపురం సర్పంచ్ జగదీష్, నాయకులు విజయ్‌కుమార్, అశోక్, కామాక్షయ్య, అంకయ్య, బాలకృష్ణయ్య, తహసీల్దార్ సుభాషిణి, ఎంపీడీఓ వీర్రాజు, ఏఈలు ఆంజనేయులు, వాసు, సర్దార్, కార్తీక్, ఏపీఎం కృష్ణయ్య పాల్గొన్నారు.

నిరుపేదలకు పక్కా గృహాలు



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ పెంచలమ్మ

సైదాపురం: నిరుపేదలకు పక్కా గృహాలను ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ పలుగొటి పెంచలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏఓ హైమావతి మాట్లాడుతూ మండలంలో రైతు భరోసాకు అర్హులైన 6,669 మంది రైతులకు ఈ నెలలో ప్రభుత్వం వారి ఖాతాల్లో నిధులు జమ చేస్తుందన్నారు. ఉద్యానవన శాఖాధికారి ఆనంద్ మాట్లాడుతూ నిమ్మ రైతులకు తోటల్లో ప్యాక్ హౌస్‌లను నిర్మించుకునేందుకు త్వరలో అనుమతులు మంజూరు చేస్తుందన్నారు. అందరు కలిసికట్టుగా మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ పెంచలమ్మ కోరారు. జెడ్పీటీసీ సభ్యులు చిత్తలూరు పోలయ్య, తహసీల్దార్ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ తిరకాల భాస్కర్, ఎంపీటీసీ సభ్యులు కరణం రమణమ్మ , సుమతి, శిరసంబేటి పద్మమ్మ, మంగళపూరి వసంతమ్మ, కుంచం శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతిని జయప్రదం చేయండి

గూడూరురూరల్ : శ్రీరామ రక్షా కుటీరంలో ఈనెల 13 నుంచి జరగనున్న హనుమాన్ జయంతి ఉత్సవాలను జయప్ర దం చేయాలని నిర్వాహకులు చిట్టిబాబు కోరారు. బుధవారం శ్రీరామ రక్షా కుటీరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 52 ఏళ్లుగా హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామ న్నారు.అనంతరం ఆహ్వా నపత్రికలు విడుదల చేశారు. పవన్‌కుమార్, గురుగుహ పాల్గొన్నారు.

నాటికల పోటీలు జయప్రదం చేయండి

గూడూరురూరల్: సంస్కృతి సమ్మేళనం ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి గూడూరులో జరిగే జాతీయస్థాయి నాటికల పోటీలను జయప్రదం చేయాలని ఆ సంస్థ కార్యదర్శి కె.ము నిగిరీష్ కోరారు. బుధవారం డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలు వద్ద నాటికల పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది దాతలు ముందుకువచ్చి ఒక్కొక్క నాటికను సమర్పించారన్నారు. విజేతలకు బహుమతులు, భోజన వసతులకు కూడా దా తలు ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో జానా శివయ్య, సోమిశెట్టి చెంచురామయ్య, కట్టా మురళీకృష్ణ, అయోధ్య శివసుబ్రమణ్యం, లక్ష్మీనారాయణ, మల్లికార్జునరావు, మురళీసింగ్ పాల్గొన్నారు.

బీసీఆర్‌కు ఎమ్మెల్యే బియ్యపు పరామర్శ



నాయుడుపేటటౌన్: పట్టణంలోని వైఎస్సార్ సీపీ నాయకుడు బైనా చంద్రశేఖర్‌రెడ్డిని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. చంద్రశేఖర్ రెడ్డి తల్లి బుజ్జమ్మ రెండు రోజులు కిందట మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి నాయుడుపేటలోని బైనా నివాసానికి వెళ్లి ఆయన్ని పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఓడూరు గిరిధర్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి, నాయకులు ఓడూరు రమణారెడ్డి, పేట చంద్రారెడ్డి, కళత్తూరు శేఖర్ రెడ్డి ఉన్నారు.

సమర్థవంతంగా ‘జగనన్నకు చెబుదాం’

పెళ్లకూరు: ప్రభుత్వ సేవలకు సంబంధించి వ్యక్తిగత స్థాయి ఫిర్యాదులకు మెరుగైన పరిష్కారం చూపుతూ అన్ని సమస్యలను ‘జగనన్నకు చెబుదాం’తో సమర్థవంతంగా పరిష్కరించుకునేలా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ రామయ్య అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న పలు శాఖల అధికారులు జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై చర్చించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందకుండా ఉంటే నేరుగా టోల్‌ఫ్రీ నంబర్ 1902కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఎంపీడీఓ సురేష్‌బాబు, ఎంఈఓ సుబ్రమణ్యం, ఏఓ ప్రవీణ పాల్గొన్నారు.